సాక్షి
సిద్దిపేట
ఆదివారం ¦ 21 ¦ సెప్టెంబర్ ¦ 2025

పూల పండుగ..

ఆధ్యాత్మిక సంరంభానికి తెరలేచింది. ఉత్సవాల నెలవు ఆశ్వయుజ మాసం పండుగలను మోసుకొచ్చింది. దసరా శరన్నవరాత్రోత్సవాలు, బతుకమ్మ పండుగ సంబురాలతో భక్తి పారవశ్యం, ఉత్సాహ భరిత వాతావరణం అలుముకోనున్నది. వేదఘోష, విశేషపూజా కార్యక్రమాలతో ఆధ్యాత్మికత వెల్లివిరియనున్న నేపథ్యంలో ఈ వారం సాక్షి కథనం.

సండే స్పెషల్

– వర్గల్(గజ్వేల్)

10లో



న్యూస్‌రీల్

22 నుంచి ఓపెన్ స్కూల్ సప్లిమెంటరీ పరీక్షలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఈ నెల 22 నుంచి 28వ తేదీ వరకు ఓపెన్ స్కూల్ సప్లిమెంటరీ పరీక్షలు కొనసాగనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, అలాగే.. మధ్యాహ్నం 2.30గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగనున్నట్లు తెలిపారు.

అధిక ధరలు వసూలు చేస్తే చర్యలు: మేనేజర్ ఆనంద్



సిద్దిపేటరూరల్: మీసేవ కేంద్రాల్లో నిర్వాహకులు అధిక వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఆనంద్ హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని మీ సేవ, ఆధార్ కేంద్రాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే ఎక్కువగా వసూలు చేయొద్దన్నారు. వినియోగదారులకు ఇబ్బందులు కలగకుండా సేవలందించాలని ఆపరేటర్లకు సూచించారు. ధరల పట్టిక, సేవలకు కావలసిన పత్రాలతో కూడిన పోస్టర్లను ప్రజలకు కనపడేలా ప్రదర్శించాలని చెప్పారు. నిర్వాహకులు అధిక వసూళ్ళకు పాల్పడితే టోల్ ఫ్రీ నంబరు1100, ఆధార్ సర్వీసులకు టోల్ ఫ్రీ నంబరు 1947కు కానీ కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని కోరారు.

స్త్రీ శక్తికి ప్రతీక 'బతుకమ్మ'

ఎమ్మెల్యే హరీశ్‌రావు



బతుకమ్మ పాటల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేటజోన్: ప్రకృతి, పూలను పూజించే పండుగ బతుకమ్మ అని, స్త్రీ శక్తికి ప్రతీక అని ఎమ్మెల్యే హరీశ్‌రావు అభివర్ణించారు. శనివారం హైదరాబాద్‌లో సిద్దిపేట ఉపాధ్యాయురాలు విజయ రూపొందించిన బతుకమ్మ పాటల పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భావి తరాలకు ఈ బతుకమ్మ పాటల పుస్తకం ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. తెలంగాణ జీవన విధానం, కుటుంబ విలువలు, బతుకమ్మ పండుగలో ప్రతిబింబిస్తాయని చెప్పారు. వెనకటి కాలం సంస్కృతిని నేటి తరానికి అందించేందుకు ఈ పుస్తకాన్ని రూపకల్పన చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ కవిత, పుస్తక రచయిత విజయ, రమ, నాగరాణి, స్వప్న, ప్రసన్న, భవాని, ఉమ పాల్గొన్నారు.

త్వరితగతిన పీహెచ్‌సీకి మరమ్మతు

జెడ్పీ సీఈఓ రమేశ్



నిర్మాణ పనులు పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ

మద్దూరు(హుస్నాబాద్): మద్దూరు, లద్నూరు పీహెచ్‌సీ మరమ్మతుల పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జెడ్పీసీఈఓ రమేశ్ అధికారులను ఆదేశించారు. శనివారం రెండు ఆరోగ్య కేంద్రాలను సందర్శించి మరమ్మతుల పనులు పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సూపరింటెండెంట్ రమణ, ఎంపీడీఓ రామ్మోహన్, ఎంపీఓ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

నూతన పథకాలతో మైనార్టీలకు లబ్ధి

జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి అహ్మద్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి రెండు నూతన పథకాలను ప్రవేశపెట్టింది. అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి షేక్ అహ్మద్ పేర్కొన్నారు. 'రేవంత్ అన్న కా సహారా మిస్కీనో కే లియే' పథకంలో ఫకీర్, దుదేకుల ఇతర ముస్లిం వర్గాల అభ్యున్నతి కోసం మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 100 శాతం సబ్సిడీతో లక్ష రూపాయల విలువ గల మోపెడ్‌లు, బైక్‌లు, ఈ-బైక్‌లు అందించనున్నట్లు తెలిపారు. అలాగే, 'ఇందిరమ్మ మైనార్టీ మహిళా యోజన' పథకం ద్వారా మైనార్టీ వితంతు, ఒంటరి, అనాథ, విడాకులు పొందిన మహిళలకు రూ. 50 వేలు అందించనున్నట్లు చెప్పారు. అర్హులైన అభ్యర్థులు అక్టోబర్ 6లోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు.



సిద్దిపేట పట్టణంలోని మార్కెట్‌లో బతుకమ్మ పూలు కొనుగోలు చేస్తున్న దృశ్యం

కొనుగోళ్లతో మార్కెట్లు కిటకిట

- పాఠశాలల్లో ముందస్తు వేడుకలు
- నేడు ఎంగిలి పూల బతుకమ్మ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): నేడు ఎంగిలి పూల బతుకమ్మ సందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలోని ప్రధాన మార్కెట్‌లు కొనుగోలు దారులతో కిటకిటలాడాయి. బతుకమ్మను తయారు చేసేందుకు అవసరమైన గునుగు, తంగెడు, పట్టు, చామంతి, బంతి, గడ్డి, తదితర పూల ధరలు అందుబాటులో ఉండటంతో మహిళలు కొనుగోలు చేశారు. కాగా బతుకమ్మను పురస్కరించుకుని పాఠశాలల్లో ముందస్తు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, మహిళ ఉపాధ్యాయులు బతుకమ్మను పేర్చి ఆడిపాడారు. దసరా సెలవులు ఉండటంతో వసతిగృహాల్లో ఉన్న విద్యార్థులు సొంత ఊర్లకు బయలుదేరడంతో బస్టాండ్ రద్దీగా మారింది. సద్దుల బతుకమ్మ, దసరాను పురస్కరించుకుని నూతన దుస్తులు, వివిధ సామగ్రి కొనుగోళ్లకు వచ్చిన ప్రజలతో జిల్లా కేంద్రం సందడిగా మారింది.



ప్రయాణికులతో కిక్కిరిసిన సిద్దిపేట బస్టాండ్

2.24 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం ఎగుమతి



గజ్వేల్ రేక్ పాయింట్ లావాదేవీలు

గతేడాది జూలై నుంచి ఇప్పటివరకు..

- గజ్వేల్ రేక్ పాయింట్ రికార్డు
- ఒక్కో రేక్ సామర్థ్యం 2,800 టన్నులపైనే..
- దేశంలోని వివిధ రాష్ట్రాలకు తరలింపు

గజ్వేల్: సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో మూడేళ్ల క్రితం ఏర్పాటైన రేక్ పాయింట్ ద్వారా ఎఫ్‌సీఐ (భారత ఆహార సంస్థ)కు చెందిన బియ్యం ఎగుమతులు రికార్డు స్థాయిలో సాగుతున్నాయి. రాష్ట్రంలో ఇప్పటికే పదికిపైగా ముఖ్యమైన రేక్ పాయింట్‌లు ఉండగా, వాటికి దీటుగా ఇక్కడ లావాదేవీలు నడుస్తున్నాయి. గతేడాది జూలై నుంచి ఇప్పటివరకు 80కిపైగా రేక్‌ల ద్వారా 2.24లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం ఎగుమతి అయ్యాయి. అలాగే.. రాష్ట్రంలోని ఎనిమిది జిల్లాలకు రసాయనిక ఎరువుల సరఫరా కేంద్రంగా, వ్యవసాయోత్పత్తుల ఎగుమతికి నిలయంగా మారింది. భవిష్యత్‌లో ఈ రేక్ పాయింట్ మరింత కీలకంగా మారనున్నది. గజ్వేల్‌లో 2022 జూన్ 27న రేక్ పాయింట్‌ను ప్రారంభించారు. ఇప్పటికే రాష్ట్రంలో సనత్‌నగర్, వరంగల్, నిజామాబాద్, కామారెడ్డి, తిమ్మాపూర్, జమ్మికుంట, మహబూబ్‌నగర్, జమ్మికుంట, మహబూబాబాద్ తదితర రేక్ పాయింట్లు ఉండగా, గజ్వేల్‌లో కొత్తగా ఏర్పాటైంది. మెదక్ జిల్లా మనోహరాబాద్ నుంచి కొత్తపల్లి వరకు 151.36 కిలోమీటర్ల పొడవున ఈ న్యూబ్రాడ్‌గేజ్ లైన్ నిర్మాణం జరుగుతుండగా.. ఈ లైన్‌పై గజ్వేల్ రైల్వే స్టేషన్ ఉన్నది. ఈ స్టేషన్ వద్ద రేక్ పాయింట్‌ను ఏర్పాటు చేశారు.

ఎఫ్‌సీఐకి ప్రధాన వనరుగా..

గజ్వేల్ రేక్ పాయింట్ ఎస్‌సీఐకి ప్రధాన వనరుగా మారింది. ఈ ప్రాంతంలోని అక్కారం, అల్లాపూర్ గోదాముల నుంచి బాయిల్డ్ రైస్‌ను దేశంలోని కేరళ, మహారాష్ట్ర, తమిళనాడు, కర్నాటక తదితర రాష్ట్రాలకు ఇక్కడి నుంచి రైలు మార్గంలో గూడ్స్ రైళ్ల ద్వారా తరలిస్తున్నారు. గతేడాది జూలై నుంచి ఇప్పటివరకు సుమారుగా 80 రేక్‌ల ద్వారా 2.24లక్షల మెట్రిక్ టన్నుల బియ్యంను ఇక్కడి నుంచి ఎగుమతి చేశారు. ఒక్కో రేక్ సామర్థ్యం 2,800 టన్నులకుపైనే ఉంటుంది. ఇదే కాదు.. ఈ రేక్ పాయింట్‌కు తమిళనాడు రాష్ట్రంలోని కరిగెకళ్, ఏపీలోని వైజాగ్, కాకినాడ పోర్టుల నుంచి రైలు మార్గం ద్వారా కాంప్లెక్స్ ఎరువులతోపాటు యూరియా నిల్వలు వస్తాయి. ఇలా వచ్చిన నిల్వలను సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్, యాదాద్రితోపాటు కామారెడ్డి, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్ తదితర జిల్లాలకు కేటాయింపుల వారీగా వ్యవసాయశాఖ సరఫరా చేస్తున్నది. మక్కలు ఇతర వ్యవసాయోత్పత్తులు సైతం ఇక్కడి నుంచి ఇతర రాష్ట్రాలను ఎగుమతి చేస్తున్నారు. మూడేళ్ల క్రితం ఏర్పాటైన ఈ రేక్ పాయింట్ అనతి కాలంలోనే తనకంటూ ప్రత్యేకతను చాటుకున్నది. ప్రత్యేకించి హైదరాబాద్ నగరంలోని రేక్ పాయింట్‌లకు ప్రత్యామ్నాయం కావడం వల్ల రాబోవు రోజుల్లో మరింత కీలకంగా మారబోతున్నది. ఈ పరిస్థితి గజ్వేల్ నియోజకవర్గంలోని మనోహరాబాద్ మండలం పరికిబండలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించబోతున్న మల్టీమోడల్ లాజిస్టిక్ హబ్‌కు అనుకూలంగా మారింది.

రుణ లక్ష్యాన్ని సాధించాలి

బ్యాంకర్లకు కలెక్టర్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ హైమావతి

సిద్దిపేటరూరల్: బ్యాంకర్లకు వివిధ సెక్టార్లో ఇచ్చిన లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ కె.హైమావతి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్లోని మీటింగ్ హాలులో ప్రాధాన్యత, ప్రాధాన్యేతర రంగాలకు రుణాల మంజూరుపై బ్యాంకర్లు, పలు శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ ద్వారా ప్రజల్లో డిజిటల్ మోసాల నివారణ, సోషల్ సెక్యూరిటీ పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. రైతులకు, వ్యవసాయ రంగానికి ఎక్కువగా రుణాలు అందించాలని కోరారు. ఇప్పటివరకు మహిళా సంఘాలకు అందించాల్సిన రుణాల్లో జిల్లా రాష్ట్రంలో 6వ స్థానంలో ఉందన్నారు. బ్యాంకర్లకు ఇచ్చిన టార్గెట్‌ను బట్టి రుణాలు అందించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ జయదేవ్‌ఆర్యా, ఆర్‌బీఐ ఏజీఎం గోమతి, నాబార్డు డీడీఎం నిఖిల్, ఎల్‌డీఎం హరిబాబు, యూబీఐ ఆర్‌హెచ్ శ్రీనివాస్, ఎస్‌బీఐ ఆర్‌ఎం మారుతి, మెదక్ డీసీసీబీ డీజీఎం విశ్వేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

వీరబైరాన్‌పల్లిగా మార్చండి

సీఎంకు ఎంపీ చామల వినతి



సీఎంకు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ చామల

మద్దూరు (హుస్నాబాద్): దూల్మిట్ట మండలం బైరాన్‌పల్లి గ్రామాన్ని ప్రభుత్వం వీరబైరాన్‌పల్లిగా పేరు మార్చాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రిని కలసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. రజాకార్లకు వ్యతిరేకంగా బైరాన్‌పల్లిలో జరిగిన పోరాటం చరిత్రలో నిలిపోతుందని, వారి దాడిలో 119 మంది అమరులైనట్లు గుర్తు చేశారు. నాటి అమరవీరుల త్యాగాలకు గుర్తుగా గ్రామాన్ని వీరబైరాన్‌పల్లిగా పేరు మార్చుతూ ప్రభుత్వం గెజిట్‌ను విడుదల చేయాలన్నారు. దీనిపై సీఎం సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు. గ్రామంలోని బురుజు, అమరవీరుల స్తూపం మరమ్మతు కోసం ఎంపీ నిధుల నుంచి రూ.10 లక్షలు మంజూరు చేసినట్లు చెప్పారు.

సంప్రదాయ పంటలకు స్వస్తి

- త్వరలోనే నర్మేట ఫ్యాక్టరీ ప్రారంభం
- ఇక్కడే పామాయిల్ ప్యాకింగ్
- మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు



నర్మేట ఫ్యాక్టరీలో ట్రయల్ రన్ ద్వారా తీసిన నూనెను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

నంగునూరు(సిద్దిపేట): సంప్రదాయంగా సాగు చేస్తున్న వరి, పత్తి, మొక్కజొన్న పంటలకు స్వస్తి పలకాలని వ్యవసాయశాఖ, మార్కెటింగ్‌శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. నర్మేటలో నిర్మించిన ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని శనివా రం ఆయన సందర్శించి పనులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గింజల నుంచి ఆయిల్ తీసే ప్రక్రియ విజయవంతంగా పూర్తయిందని, అధికారులు చెప్పడంతో సీఎం చేతుల మీదుగా ప్రారంభించేలా సిద్ధం చేయాలన్నారు. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే నర్మేటలో అత్యాధునిక టెక్నాలజీతో నిర్మిస్తున్న ఆయిల్ ఫ్యాక్టరీపైనే మొదటి సంతకం చేసినట్లు గుర్తు చేశారు. నర్మేట ఫ్యాక్టరీ దేశానికే దిక్సూచిగా నిలుస్తుందన్నారు. హైదరాబాద్‌కు సమీపంలో ఉన్న ఈ ఫ్యాక్టరీ సిద్దిపేట జిల్లాకు ఎంతో కీలకంగా మారనుందన్నారు. రాష్ట్రంలో తయారయ్యే పామాయిల్‌ను ఇతర రాష్ట్రాలకు పంపితే అక్కడే ప్యాకింగ్ చేశారని, ఇక నుంచి నర్మేటలోనే శుద్ధి చేసి ప్యాకింగ్ చేస్తారన్నారు.

నాలుగేళ్ల అంతర పంటలు

ఆయిల్‌పామ్ తోటలోనాలుగేళ్ల పాటు అంతర పంటగా కోకో, జాజి, మొకడామియా, మునగ, వక్క పంటలను సాగు చేయడంతో అధిక లాభాలు గడించవచ్చని మంత్రి అన్నారు. ఆయిల్‌పామ్ టన్నుకు రూ.20 వేలు అందించేలా కృషి చేస్తామన్నారు. కావున ఆయిల్‌పామ్ సాగు శాతం పెంచేలా అధికారులు, శాస్త్రవేత్తలు కృషి చేయాలన్నారు. ఆయన వెంట ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగ రాఘవరెడ్డి, రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ రఘునందన్‌రావు, ఉద్యానవన శాఖ డైరెక్టర్ షేక్ యాస్మిన్‌బాషా, కలెక్టర్ హైమావతి, అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్, ఆయిల్‌ఫెడ్ ఎండీ శంకరయ్య, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి సువర్ణ, ఆయిల్‌ఫెడ్, వ్యవసాయ, రెవిన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు.

కనెక్షన్.. కలెక్షన్!

- విద్యుత్ శాఖలో పైరవీలదే రాజ్యం
- అధికారులు, కాంట్రాక్టర్ల చేతి వాటం
- ఒక్కో కనెక్షన్‌కు రూ10 వేల నుంచి 20 వేలు వసూలు



సాక్షి, సిద్దిపేట: విద్యుత్ శాఖలో పైరవీలకే పెద్దపీట వేస్తున్నారు. పైస లేనిదే పని కావడం లేదని ఆరోపణలు ఉన్నాయి. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం డీడీలు చెల్లించినా అధికారులు, కాంట్రాక్టర్లకు చేతులు తడపాల్సిందే. దరఖాస్తులు సీరియల్ నంబర్ ప్రకారం కాకుండా పైరవీ చేసిన వారికే పెద్దపీట వేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. లేకుంటే ఏదో సాకులు చెప్పి విద్యుత్ కనెక్షన్‌లు జాప్యం చేస్తున్నారు. విద్యుత్ ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడం.. కొందరు సిబ్బంది, కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా డబ్బులు వసూలు చేస్తున్నారని తెలుస్తోంది. దీంతో రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అందిస్తుండటంతో సాగునీటి సౌకర్యం లేని సన్నకారు రైతులు సైతం బోరు వేసి పంటలను పండిస్తున్నారు. ఒకప్పుడు వర్షాధారం మీదనే పంటలు పండించేవారు. ప్రస్తుతం బోర్ల ద్వారా పంటలు ఎక్కువగానే సాగు చేస్తున్నారు. దీంతో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లకు డిమాండ్ పెరిగింది. జిల్లా వ్యాప్తంగా 2,627 విద్యుత్ కనెక్షన్లు ఇంకా పెండింగ్ ఉన్నాయి.

కాసులిస్తేనే..

కొత్తగా విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న వారి నుంచి కొందరు విద్యుత్ అధికారులు, సిబ్బంది, కాంట్రాక్టర్లు కాసులు దండుకుంటున్నారు. సిఫార్సులు, పైరవీలతో పాటు చేతులు తడిపిన వారికే ముందస్తు కనెక్షన్లు ఇస్తున్నారు. సాధారణ రైతులకు మాత్రం నెలల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. ట్రాన్స్‌ఫార్మర్, ఇతర మెటీరియల్, కనెక్షన్ కావాలంటే రూ.10వేల నుంచి రూ.20వేల వరకు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి అవినీతి, అక్రమాలను అరికట్టాలని రైతులు, వినియోగదారులు కోరుతున్నారు.

మూడు కనెక్షన్లకు రూ.21 వేలు ఇచ్చాం

మూడు విద్యుత్ కనెక్షన్ల కోసం డీడీలు కట్టేందుకు రూ.21వేలు మా ఊరికి వచ్చే కరెంట్ ఆఫీసర్‌కు ఇచ్చా. ట్రాన్స్‌ఫార్మర్ ఫిట్టింగ్ కోసం రూ 4వేలు ఇచ్చా. ట్రాన్స్‌ఫార్మర్ ఎప్పటికీ జంపర్ పోతుంది. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు.

- కిష్టయ్య, వెంకట్రావు పేట

ఒక్క రూపాయి ఇవ్వవద్దు



విద్యుత్ కనెక్షన్లు, విద్యుత్ శాఖలో ఇతర పనుల నిమిత్తం ఎవరికీ ఒక్క రూపాయి ఇవ్వవద్దు. తీసుకున్న వారిపై చర్యలు తీసుకుంటాం. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం డీడీలు తీసిన తర్వాత సీరియల్ నంబర్ వారీగా మంజూరు అవుతుంటాయి.

- చంద్రమోహన్, ఎస్‌ఈ, టీజీఎస్పీడీసీఎల్

నీట మునిగిన పంట..



చిన్నకోడూరులో నీట మునిగిన వరి పంట

చిన్నకోడూరు(సిద్దిపేట): మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువుల కింద ఉన్న సాగు భూముల్లో వరి పంట నీట మునిగింది. చిన్నకోడూరు పెద్ద చెరువు అలుగు ఉధృతంగా పారడంతో సమీపంలో రైతులు వేసిన వరి పంట నీట మునిగింది. అలాగే గ్రామాల్లోని చెరువులు అలుగు పారడంతో కాలువలు నిండి పంటలు నీట మునిగాయి. ఈదురు గాలులకు మాచాపూర్‌లో మొక్కజొన్న పంట నేలకొరిగింది. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

జిల్లా ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

సిద్దిపేటజోన్: మహబూబ్‌నగర్‌లో 25 నుంచి 28 వరకు జరగనున్న రాష్ట్రస్థాయి సీనియర్ల ఫుట్‌బాల్ టోర్నీకి జిల్లా జట్టు ఎంపిక చేశారు. స్థానిక ఫుట్‌బాల్ మైదానంలో కోచ్ అక్బర్ ఆధ్వర్యంలో శనివారం ఎంపిక జరిగింది. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు హాజరయ్యారు. ప్రతిభ చూపిన 20 మందిని జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. ఎంపికైన వారికి ఆదివారం నుంచి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని కోచ్ తెలిపారు.

నవరాత్రులకు రండి

మంత్రి 'పొన్నం'కు ఆహ్వానం




మంత్రి పొన్నంకు ఆహ్వానపత్రిక అందజేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

వర్గల్(గజ్వేల్): వర్గల్ క్షేత్రంలో సోమవారం నుంచి ప్రారంభం కానున్న దసరా శరన్నవరాత్రోత్సవాలకు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆహ్వానించారు. ఈ మేరకు శనివారం ఆలయ కమిటీ ప్రతినిధులు ఆహ్వానపత్రిక అందజేశారు. హైదరాబాద్‌లో మంత్రిని కలిశామని, 29న మూల మహోత్సవానికి హాజరవుతానని మంత్రి పేర్కొన్నట్లు వారు తెలిపారు.



దుబ్బాకలో ఉత్సాహంగా బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు



గజ్వేల్‌రూరల్: సింగాటం ప్రభుత్వ పాఠశాలలో బతుకమ్మ సంబురాలు

చట్టాలపై అవగాహన అవసరం

సీనియర్ సివిల్ జడ్జి మిలింద్ కాంబ్లే



మాట్లాడుతున్న మిలింద్ కాంబ్లే

మిరుదొడ్డి(దుబ్బాక)/సిద్దిపేటకమాన్: చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉంటేనే సమాజంలో క్రైం రేట్ తగ్గుతుందని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ మిలింద్ కాంబ్లే అన్నారు. మండల పరిధిలోని కొండాపూర్ ప్రభుత్వ పాఠశాలలో శనివారం చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అలాగే.. సిద్దిపేట జిల్లా జైలును సందర్శించి వంట గది, స్టోర్ రూంను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతో పాటు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఎలాంటి సమస్యలు వచ్చినా వాటి పరిష్కారానికి జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సిద్దిపేట కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఖైదీలు సత్ప్రవర్తనతో ఉండాలన్నారు. ఖైదీలందరికీ న్యాయవాదుల ఉండాలన్నారు. లేనివారికి లీగల్ ఎయిడ్ కౌన్సిల్ న్యాయ సహాయం అందిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ వికాస్, న్యాయవాదులు యాదయ్య, ఖాజీపురం యోగేందర్, పారా లీగల్ వాలంటీర్ సీహెచ్ కవిత, ప్రొ.పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థిని చితకబాదిన టీచర్


గాయాలైన విద్యార్థి

చిన్నకోడూరు(సిద్దిపేట): అకారణంగా విద్యార్థిని చితకబాదిన టీచర్‌పై చర్యలు తీసుకోవాలని విద్యార్థి తల్లిదండ్రులు శనివారం ఎంఈఓ యాదవరెడ్డికి ఫిర్యాదు చేశారు. బాధిత విద్యార్థి తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని రామంచ గ్రామానికి చెందిన హర్షవర్ధన్ ఇబ్రహీంనగర్ మోడల్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. శుక్రవారం ఉపాధ్యాయుడు సలీమ్ విద్యార్థిని అకారణంగా చితకబాదాడు. గతంలో కూడా ఈ టీచర్ ఇలానే కొట్టాడని పేర్కొన్నాడు. దీంతో ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేయడంతో కక్ష పెట్టుకున్నాడని వాపోయాడు. అకారణంగా గాయపర్చిన టీచర్‌పై చర్యలు తీసుకోవాలని కోరాడు. ఈ విషయమై ప్రిన్సిపాల్ సతీశ్‌ను వివరణ అడగగా సలీమ్ పాఠశాలలో కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్నాడని, అతడ్ని విధుల్లోంచి తొలగించామన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత


రేషన్‌బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు

రేగోడ్(మెదక్): అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో ఏఎస్ఐ శంకర్, పోలీసులు సిబ్బంది పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో పోచారం చౌరస్తా వద్ద పెద్ద తండా నుండి నారాయణఖేడ్ వైపు వెళ్తున్న బొలెరో వాహనాన్ని తనిఖీ చేశారు. అందులో దాదాపు 30 క్వింటాళ్ల రేషన్ బియ్యంను అక్రమంగా తరలిస్తుండగా పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. శనివారం సివిల్ సప్లై అధికారులు రేషన్ బియ్యాన్ని పరిశీలించి స్వాధీనం చేసుకున్నారు. బియ్యం తరలిస్తున్న మెగావత్ రాజుపై కేసు నమోదు చేశారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

నిజాంపేట(మెదక్): పేకాట ఆడుతున్న ఏడుగురిపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ రాజేశ్ కథనం ప్రకారం... మండల పరిధిలోని వెంకటపూర్ (కె) గ్రామ శివారులో గోపరి రమేశ్‌కు చెందిన పౌల్ట్రీ ఫామ్‌లో అతడితో పాటు పేకాట ఆడుతున్న కుక్కుదు నవీన్, గువ్వలెగి రమేశ్, కుక్కుదు రమేశ్, చిగుల్లా మధు, గోపరి నాగరాజు, కుక్కుదు అనిల్‌ను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 50,960 నగదు, 6 సెల్ ఫోన్లు, 2 బైక్‌లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. వీరిని శనివారం సత్ప్రవర్తన గురించి సంవత్సర కాలం పాటు తహసీల్దార్ శ్రీనివాస్ ఎదుట బైండోవర్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

గోవా మద్యం స్వాధీనం


ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్న మద్యం బాటిళ్లు

జహీరాబాద్ టౌన్: గోవా నుంచి అక్రమంగా తీసుకొస్తున్న మద్యం బాటిళ్లను ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. ఎక్సైజ్ ఎస్ఐ.కోటేశ్వర్ గౌడ్ వివరాల ప్రకారం...జిల్లా సూపరింటెండెంట్ నవీన్‌చంద్ర ఆదేశాల మేరకు శనివారం మండలంలోని చిరాగ్‌పల్లి చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ చేశారు. ఈ క్రమంలో ట్రావెల్స్ బస్సు, తదితర వాహనాల్లో తరలిస్తున్న వివిధ బ్రాండ్స్‌కు చెందిన 36 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. మద్యం బాటిళ్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

పారిశుద్ధ్య కార్మికురాలు ఆత్మహత్యాయత్నం

నిజాంపేట(మెదక్): అధికారి వేధింపులు భరించలేక పారిశుద్ధ్య కార్మికురాలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... మండల కేంద్రంలో కొమ్మాట ఇందిర 12 ఏళ్లుగా గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికురాలుగా విధులు నిర్వహిస్తుంది. ఈ క్రమంలో మూడు నెలల నుంచి జీతాలు చెల్లించే విషయంలో పంచాయతీ కార్యదర్శి నర్సింలు ఇబ్బందులకు గురిచేస్తూ జీతం ఇవ్వడం లేదు. దీంతో మనస్తాపం చెందిన ఇందిర శనివారం మధ్యాహ్నం గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. విషయం తెలుసుకున్న కుటుంబీకులు వెంటనే చికిత్స నిమిత్తం నార్సింగ్ ఆస్పత్రికి తరలించారు.

పూల పండుగ.. అమ్మకు అర్చన


బతుకమ్మలతో మహిళలు

ఆధ్యాత్మిక సంరంభానికి తెరలేచింది. ఉత్సవాల నెలవు అశ్వయుజ మాసం పండుగలను మోసుకొచ్చింది. దసరా శరన్నవరాత్రోత్సవాలు, బతుకమ్మ పండుగ సంబురాలతో భక్తి పారవశ్యం, ఉత్సాహ భరిత వాతావరణం అలుముకోనున్నది. వేదఘోష, విశేష పూజా కార్యక్రమాలతో ఆధ్యాత్మికత వెల్లివిరియనున్న నేపథ్యంలో ఈ వారం సాక్షి కథనం.
- వర్గల్(గజ్వేల్):

- గౌరారం విజయ్‌రావు

దసరా నవరాత్రోత్సవాల వైభవం
- బతుకమ్మ సంరంభం
- ఆధ్యాత్మికతల అశ్వయుజ మాసం
- ఎల్లెడలా పండుగ వాతావరణం

దసరా శరన్నవరాత్రోత్సవ వైభవం..

ఆశ్వయుజ మాసంలో దేవీ శరన్నవరాత్రోత్సవాల సందర్భంగా సకల శక్తి స్వరూపిణి ఆదిపరాశక్తి, జగన్మాతను తొమ్మిది రోజులపాటు తొమ్మిది రూపాల్లో అత్యంత భక్తిశ్రద్ధలతో పూజిస్తారు. ఉత్సవాల తొలిరోజు 22న సోమవారం బాలాత్రిపురసుందరిగా, 23న గాయత్రీదేవిగా, 24న అన్నపూర్ణాదేవిగా, 25న కాత్యాయనిదేవిగా, 26న మహాలక్ష్మిగా, 27న లలితా త్రిపురసుందరిగా, 28న మహాచండీ, 29న మహాసరస్వతిగా, 30న దుర్గాదేవిగా, అక్టోబర్1న మహిషాసుర మర్దినిగా, 2న రాజరాజేశ్వరీదేవిగా అమ్మవారు సేవలందుకుంటారని వేదపండితులు పేర్కొన్నారు. శరన్నవరాత్రోత్సవాలకు రాష్ట్రంలో రెండో బాసరగా పేరొందిన వర్గల్ శ్రీవిద్యాసరస్వతి ఆలయంతోపాటు తదితర ప్రముఖ ఆలయాలు ముస్తాబవుతున్నాయి.

పూల పండుగ.. బతుకమ్మ

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా బతుకమ్మ పండుగకు విశిష్ట స్థానం ఉన్నది. భాద్రపద అమావాస్య నుంచి తొమ్మిది రోజుల సంరంభం మొదలవుతుంది. చివరిరోజు సద్దుల బతుకమ్మతో ఈ ఉత్సవాలు ముగుస్తాయి. బతుకమ్మను పేర్చడం ఒక ఆనవాయితీ. ప్రకృతిలో లభించే గునుగు, తంగేడు, పట్టుకుచ్చులు, బంతి, చేమంతి తదితర పూలను సేకరించి, పళ్లెంలో గుమ్మడి ఆకులపై పూలను కళాత్మకంగా పేర్చి బతుకమ్మను తీర్చిదిద్దుతారు. ఈ పండుగను బాలికలు, మహిళలు ఉత్సాహంగా జరుపుకుంటారు. కొత్త దుస్తులు, రకరకాల ఆభరణాలు అలంకరించుకుని ముస్తాబవుతారు. ప్రతి నిత్యం గ్రామ కూడళ్లలో బతుకమ్మలను పెట్టి లయబద్ధమైన చప్పట్లతో తిరుగుతూ ఉయ్యాల పాటలు పాడుతారు.


పేర్చిన బతుకమ్మతో మహిళలు

తొమ్మిది రోజులు.. తొమ్మిది పేర్లతో..

బతుకమ్మ పండుగను తొమ్మిది రోజులు, తొమ్మిది పేర్లతో జరుపుకుంటారు. మొదటిరోజు ఎంగిలిపూల బతుకమ్మ, రెండో రోజు అటుకుల బతుకమ్మ, మూడోరోజు ముద్దపప్పు బతకమ్మ, నాలుగో రోజు ముత్యాల బతకమ్మ, ఐదో రోజు అట్ల బతుకమ్మ, ఆరో రోజు అలిగిన బతుకమ్మ, ఏడో రోజు వేపకాయల బతుకమ్మ, ఎనిమిదోరోజు వెన్నముద్దల బతుకమ్మ, తొమ్మిదో రోజు సద్దుల బతుకమ్మగా సంబురాలు జరుపుకుంటారు. ప్రాంతాలను బట్టి పేర్లలో కొన్ని తేడాలుంటాయని పండితులు చెబుతున్నారు.

శరదృతువులో ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి సోమవారం నుంచి నవమి వరకు భక్తి శ్రద్ధలతో తొమ్మిది రోజులపాటు నవ రూపాల్లో విశేషాలంకరణలో సకల శక్తిస్వరూపిణి అమ్మవారిని పూజించేందుకు ఆలయాలు, ఆధ్యాత్మిక కేంద్రాలు, గ్రామాల్లో అమ్మవారి మండపాలు ముస్తాబయ్యాయి. మరోవైపు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల ప్రతీక బతుకమ్మ పండుగ ఆదివారం నుంచి ప్రారంభమవుతుండగా.. పూల పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకునేందుకు తరుణీమణులు సిద్ధమవుతున్నారు.


ఆలయంలో సరస్వతి అమ్మవారు

బతుకమ్మ గౌరీదేవి స్వరూపం

బతుకమ్మ గౌరమ్మ స్వరూపమని, ఈ అమ్మవారు పసుపు కుంకుమలతో నిండా నూరేళ్లు బతకమని ఆశీర్వదిస్తుందని ప్రజల నమ్మకం. అందుకే బతుకమ్మను ఆటగా కాకుండా ఆరాధనగా, పూజగా జరుపుకుంటారు. బతుకమ్మలకు, గౌరమ్మను చేర్చి ధూపాలు, దీపాలు, నైవేద్యాలు అందించి భక్తి ప్రపత్తులతో ప్రదక్షిణలు చేసి గంగమ్మ ఒడికి చేరుస్తారు.

విశేషమైన సద్దుల బతుకమ్మ

సద్దుల బతుకమ్మను విశేషంగా భావిస్తారు. ఆ రోజు వీలైనంత ఎక్కువ ఎత్తులో బతుకమ్మను పేర్చుతారు. రంగురంగుల వివిధ రకాల పూలతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతారు. ఇందులో మహిళలకు పురుషులు తోడ్పాటుగా నిలుస్తారు. మొక్కజొన్నలు, పెసర్లు మొదలైన ఆయా ప్రాంతాల్లో పండిన ధాన్యాలతో పాటు, చింతపండు, నిమ్మకాయ, పెరుగు, నువ్వులు, కొబ్బరి తదితరాలతో సద్దులు చేసి బతుకమ్మకు నివేదిస్తారు.

ప్రకృతిలో పూల వాతావరణం

బతకమ్మ పండుగ వచ్చే తరుణంలో ప్రకృతిలో మార్పులు కనపడతాయి. ప్రకృతి రకరకాల పూలతో అలంకరించుకుంటున్నట్లు ఉంటుంది. చెరువులు, జలాశయాలు నీటితో నిండుగా మారుతాయి. బతుకమ్మ ఆడి నీటిలో వదిలిన తర్వాత చెరువులు పూల సోయగంతో అలరారుతాయి. జీవ వైవిధ్యం, పర్యావరణ పరిరక్షణకు పూల పండుగ బాసటగా నిలుస్తుంది. అమ్మవారి శరన్నవ రాత్రులతో బతుకమ్మ పండుగకు అవినాభావ సంబంధం కన్పిస్తుంది. తొమ్మిది రోజులు తొమ్మిది రకాల పేర్లతో బతుకమ్మను ఆరాధిస్తారు.


వర్గల్ మండలం చౌదరిపల్లిలో బంతిపూల తోట

పెత్తర అమావాస్య ఉయ్యాలో...


పెత్తర అమావాస్య సందర్భంగా గతించిన తమ పెద్దల పేరిట బ్రాహ్మణులకు బియ్యం, కాయగూరలు దానం చేస్తున్న దృశ్యం

దుబ్బాక: భారతీయ సంస్కృతి మనకు ముందుగా నేర్పింది. మాతృ దేవోభవ, పితృదేవోభవ. ఆ తర్వాతే ఆచార్యుడైనా, అతిథి అయినా, చివరకు దేవతలైనా సరే కన్నతల్లిదండ్రులను మొదటగా పూజించాలి. మరణించిన మన వంశోద్ధారకుల కోసం ఏడాదిలో భాద్రపద మాసం బహుళ పక్షంలోని 15 రోజులు మహాలయ పక్షంగా పరిగణిస్తారు. మన మూలాలను మనకు గుర్తు చేసే మంచి సమయం పితృపక్షం. మొన్నటి పున్నమి తెల్లవారి పాడ్యం నుంచి వచ్చే అమావాస్య వరకు మన వంశవృక్షాన్ని పెంచి పెద్ద చేసిన మాతృ, పితృ దేవతలంతా కొలువుదీరే కాలం ఆఖరిరోజు పెత్తర అమావాస్య. ఏడాదికి ఒక్కసారి వచ్చే అమావాస్యను చాల గొప్పరోజుగా జరుపుకుంటారు.

ముఠాగా ఏర్పడి చోరీలు

ముగ్గురు నిందితుల రిమాండ్


నిందితుల వివరాలు వివరిస్తున్న ఎస్ఐ లింగం

నర్సాపూర్: వరుస చోరీలకు పాల్పడుతున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేసి రిమాండుకు పంపించారు. శనివారం ఎస్ఐ లింగం విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. మండలంలోని ఎర్రకుంట తండాకు చెందిన ముడావత్ అంజ్య, హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న నెల్లూరు జిల్లాకు చెందిన చిల్లకూరి కృష్ణ, టేక్మాల్ మండలానికి చెందిన నెమలి శ్రీనివాస్ ముఠాగా ఏర్పడి చోరీలు చేస్తున్నారు. కాగా ఉదయం స్థానిక చౌరస్తాలో వాహనాలు తనిఖీ చేస్తుండగా పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించగా అదుపులోకి తీసుకొని విచారించగా చోరీలు చేసినట్లు అంగీకరించారు. నర్సాపూర్‌లో ఇటీవల మూడు దుకాణాల్లో చోరీకి పాల్పడి రెండు దుకాణాల నుంచి అపహరించిన 20తులాల వెండి బిళ్లలు, రూ.2వేలు, ఇతర వస్తువులు దొంగిలించినట్లు ఒప్పుకున్నారు. చోరీ చేసిన సొమ్ముతోపాటు టీవీఎస్ జూపిటర్, ఇనుప రాడ్లు, ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కాగా పలు చోరీ కేసుల్లో జైలుకు వెళ్లారని, అక్కడే పరిచయం ఏర్పడి జైలు నుంచి విడుదల కాగానే ముగ్గురు కలిసి దొంగతనాలకు పాల్పడ్డారని పోలీసులు తెలిపారు.

మరో చోరీ కేసులో...

వారం క్రితం మండలంలోని నారాయణపూర్ గ్రామంలో ఆరు ఇండ్లలో చోరీ చేసిన నిందితున్ని అరెస్టు చేసినట్లు ఎస్ఐ లింగం తెలిపారు. కొల్చారం మండలం నాయిని జలాల్‌పూర్ గ్రామానికి చెందిన నీరుడి కృష్ణ చోరీకి పాల్పడ్డాడని, అతని వద్ద నుంచి సొత్తును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు పంపినట్లు పేర్కొన్నారు.

వరి విత్తనోత్పత్తితో ఆదాయం

మిరుదొడ్డి(దుబ్బాక): వరి విత్తనోత్పత్తితో రైతులు మరింత ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చని తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, తోర్నాల శాస్త్రవేత్త డా. సీహెచ్ పల్లవి తెలిపారు. శనివారం అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని మోతె గ్రామంలో గ్రామ గ్రామాన నాణ్యమైన విత్తనం కార్యక్రమంలో భాగంగా జేజీఎల్-24423 వరి విత్తనం సాగు చేస్తున్న పొలాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిశోధన కేంద్రాల్లో శుద్ధి చేసిన నాణ్యమైన వరి విత్తనాలను ఒక్కో గ్రామానికి చెందిన ముగ్గురు రైతులకు సాగుకు ఇచ్చామన్నారు. ఈ సాగును యాజమాన్య పద్ధతులు పాటించి మంచి దిగుబడులు సాధించి ఇతర రైతులకు నాణ్యమైన విత్తనాలను సరఫరా చేసేలా రైతులను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సత్యాన్వేష్, ఏఈఓ మహేశ్, మాజీ సర్పంచ్ కాలేరు శ్రీనివాస్, రైతులు రాజేశ్వర్, జన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


వరి విత్తన సాగును పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్త డా. పల్లవి

భూ పరీక్షల ఆధారంగానే ఎరువులు

డాక్టర్ జయకుమార్

కొమురవెల్లి(సిద్దిపేట): భూ పరీక్షల ఆధారంగానే పంటలకు ఎరువులు వాడాలని , ప్రస్తుతం అందించే సాయిల్ కిట్‌తో రైతులు స్వయంగా మట్టి పరీక్షలు చేసుకోవచ్చని భారతీయ వరిపరిశోధన సంస్థ సీనియర్ సైంటిస్టు డాక్టర్ జయకుమార్ అన్నారు. శనివారం మండలంలోని కిష్టంపేట గ్రామంలో భారత వ్యవసాయ, రైతుల సంక్షేమ మంత్రిత్వ శాఖ, త్రినేత్ర ఫౌండేషన్‌లు ఎస్సీ ఉప ప్రణాళికలో భాగంగా 100 మంది రైతులకు సాయిల్ కిట్, బ్యాటరీ స్ప్రేయర్‌లు ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా సాయిల్ కిట్, స్ప్రేయర్ వాడకంపై రైతులకు శిక్షణనిచ్చారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. రైతులు ఇష్టానుసారంగా రసాయన ఎరువులను వాడి భూమిని విషతుల్యం చేయవద్దన్నారు. తక్కువ ఎరువులు వాడుతూ సేంద్రియం వైపు వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ వరి పరిశోధన సీనియర్ సైంటిస్టులు డాక్టర్ బ్రిజేంద్ర, జశ్వంత్ కుమార్, బీజేపీ కేంద్ర, రాష్ట్ర సమన్వయ కర్త నూనే బాల్‌రాజు, భారతి, బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు స్వరూప, రాజు, మురళి, రజనీకాంత్, రైతులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ జయకుమార్

ట్రాక్టర్, బైక్ ఢీ..

పటాన్‌చెరు టౌన్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీశైలం వివరాల ప్రకారం... ఇంద్రేశం సిటిజన్ కాలనీకి చెందిన నంద కుమార్ (22) అతడి బావ లక్ష్మణ్ వద్ద ఉంటూ పాశమైలారం పారిశ్రామికవాడలో ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం డ్యూటీకి బైక్‌పై వెళ్తుండగా ముత్తంగి సర్వీస్ రోడ్డులో జీపీఆర్ వెంచర్ నుంచి రోడ్డు పైకి పటాన్‌చెరు వైపు వస్తున్న ట్రాక్టర్ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో నందకుమార్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. మృతుడి బావ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అదుపు తప్పి.. చెట్టును ఢీకొట్టి..

కొల్చారం(నర్సాపూర్): వాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొట్టడంతో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని ఎనగండ్ల గ్రామంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన కొరబోయిన శ్రీశైలం(32) దుంపలకుంట చౌరస్తాలో పంక్చర్ దుకాణం నడుపుతూ భార్య పిల్లలతో కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రాత్రి గిరాకీ ఉండటంతో ఇంటికి వెళ్లడం ఆలస్యమైంది. పని ముగియగానే తన బైక్ పై ఇంటికి వస్తున్నాడు. గ్రామ శివారులోని మామిడి చెరువు కట్ట వద్దకు రాగానే బైక్ అదుపు తప్పి పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టింది. దీంతో శ్రీశైలం తలకు, ఇతర భాగాల్లో తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఐదేళ్లలోపు కూతురు, కుమారుడు ఉన్నారు.

యువతి అదృశ్యం


లున్సావత్ కవిత

నర్సాపూర్ రూరల్: ఓ యువతి అదృశ్యమైంది. ఎస్సై లింగం వివరాల ప్రకారం.. మండలంలోని కొక్య తండాకు చెందిన లున్సావత్ బిక్యా కూతురు కవిత(21) ఈనెల 18న రాత్రి నుంచి కనిపించకుండా పోయింది. అదే రోజు కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

యువకుడి ఆత్మహత్య

కొమురవెల్లి(సిద్దిపేట): ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల వివరాల ప్రకారం... మండలంలోని గౌరాయపల్లి గ్రామానికి చెందిన పెద్ది మధుసూదన్ రెడ్డి(24) వ్యవసాయ పనుల నిమిత్తం మధ్యాహ్నం తన పొలం దగ్గరకు వెళ్లి పురుగుల మందు తాగాడు. కొట్టు మిట్టాడుతుండగా స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. దీంతో వెంటనే సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. దీనిపై పోలీసులను వివరణ కోరగా ఇంత వరకు ఎవరు ఫిర్యాదు చేయలేదని తెలిపారు.

పట్టపగలే దారి దోపిడీ

- తల్లీకొడుకులను అడ్డుకుని ఆరు తులాల బంగారు నగలు అపహరణ
- దుండగుడి దాడిలో కొడుకుకు గాయాలు


మద్నూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎల్లాగౌడ్

మద్నూర్(జుక్కల్): కామారెడ్డి జిల్లా మద్నూర్ మండల కేంద్రానికి సమీపంలో శనివారం పట్టపగలే జరిగిన దారి దోపిడీ స్థానికంగా కలకలం రేపింది. వివరాలు ఇలా ఉన్నాయి. మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన మల్లయ్యగారి ఎల్లాగౌడ్, అతని తల్లి సీతమ్మ కలిసి బైక్‌పై మద్నూర్‌లో జరిగే ఓ ఫంక్షన్‌కు హాజరయ్యేందుకు బయలుదేరారు. మద్నూర్ సమీపంలో జాతీయ రహదారి 161 నుంచి మద్నూర్ వైపునకు వచ్చే సర్వీస్ రోడ్డుపైకి రాగానే వెనక నుంచి బైక్‌పై హెల్మెట్‌లు ధరించిన ఇద్దరు వేగంగా వచ్చి తల్లీకొడుకులను అడ్డుకున్నారు. కత్తి తీసి బెదిరించి సీతమ్మ ఒంటిపై ఉన్న బంగారు నగలను ఇవ్వాలన్నారు. దీంతో సీతమ్మ కొడుకు ఎల్లాగౌడ్ అడ్డుకోగా తోపులాట జరిగింది. ఇద్దరు దుండగులలో ఒకరి హెల్మెట్ కింద పడిపోయింది. దీంతో దుండగుడు కత్తితో ఎల్లాగౌడ్‌పై దాడి చేసి చంపేస్తామని బెదిరించాడు. అప్పటికే ఎల్లాగౌడ్ చేతికి గాయం కావడంతో భయపడిన సీతమ్మ తన ఒంటిపై గల నాలుగు తులాల బంగారు నెక్లెస్, రెండు తులాల పుస్తెల తాడు దుండగులకు ఇచ్చేసింది. నగలను తీసుకుని వారు పారిపోయారు. సమాచారం అందుకున్న స్థానికులు తల్లీకొడుకులను మద్నూర్ ఆస్పత్రిలో చేర్పించి వైద్యం అందించారు. ఎస్సై విజయ్‌కొండ, పోలీసు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. ఈ దారి దోపిడీ ఘటనతో స్థానికుల్లో ఆందోళన నెలకొంది.

దశదినకర్మ కెళ్లి స్నానం చేస్తుండగా..

చెరువులో మునిగి యువకుడు మృతి


రమేశ్

చిన్నశంకరంపేట(మెదక్): స్నానం చేసేందుకు వెళ్లిన యువకుడు చెరువులో మునిగి మృతి చెందాడు. ఈ ఘటన శనివారం మండలంలోని సూరారం గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బీపేట రమేశ్(32) కుటుంబ సభ్యులతో కలిసి పెదనాన్న దశదినకర్మలో పాల్గొనేందుకు వెళ్లాడు. రెడ్డిచెరువు వద్ద తలవెంట్రుకలు తీసుకుని చెరువులో స్నానం చేసేందుకు దిగాడు. ఈ క్రమంలో రమేశ్ ప్రమాదవశాత్తు చెరువులోని గుంతలో జారి పడిపోయాడు. ఈత రాకపోవడంతో నీటిలో మునిగిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు చెరువులోంచి బయటకు తీసినప్పటికీ అతడు మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

గంజాయి పట్టివేత

రామచంద్రాపురం(పటాన్‌చెరు): గంజాయి తరలిస్తున్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ జగన్నాథ్ కథనం ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన ఇలియాస్ గౌస్, షారుక్‌ఖాన్ కలిసి ఒడిశా నుంచి గంజాయి తీసుకొని ముంబైకి బయలుదేరారు. మాదాపూర్ ఎస్ఓటీ, స్థానిక పోలీసులు విశ్వసనీయ సమాచారం మేరకు ముంబై వెళుతున్న వారి కారును రామచంద్రాపురం ఇక్రిశాట్ సమీపంలో తనిఖీ చేశారు. కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి 166కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కారును సీజ్ చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు.

సంగారెడ్డిలో..

సంగారెడ్డి టౌన్: గంజాయి అమ్ముతున్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రూరల్ ఎస్సై రవీందర్ వివరాల ప్రకారం... మండలంలోని ఇస్మాయిల్ ఖాన్‌పేట గ్రామ శివారులో పోలీసులు వాహనాల తనిఖీలు చేస్తుండగా స్కూటీపై ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. దీంతో వారిని పట్టుకొని విచారించగా వారి వద్ద 3.8 కిలోల గంజాయి లభించింది. ఒడిశాకు చెందిన భిమల్ లోచన్, మోహన్ పండా ఇద్దరు ఒడిశా నుంచి గంజాయి తీసుకొచ్చి సంగారెడ్డి పరిసర ప్రాంతంలో ప్యాకెట్లు చేసి అమ్ముతున్నారు. వారి నుండి గంజాయి, సెల్‌ఫోన్లు, వాహనం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ ఇద్దరు మృతి

రామాయంపేట(మెదక్): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. వివరాలు... చేగుంట మండలం బోనాల పిట్టల తండాకు చెందిన పిట్టల గుడ్డు (40) ఈనెల 15న రామాయంపేటలో టీవీఎస్ మోపెడ్‌పై వెళుతూ ప్రమాదవశాత్తు కింద పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అతన్ని హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు.

మరో ఘటనలో మహిళ..

మర్కూక్(గజ్వేల్): మండలంలోని పాములపర్తి గ్రామానికి చెందిన భూపాల్‌రెడ్డి అదే గ్రామానికి చెందిన కొండి ఎల్లమ్మ (45) తో ఇటీవల గొడవ పడ్డాడు. దీంతో ఇద్దరు నెట్టుకోవడంతో ఎల్లమ్మకు కడుపులో బలమైన గాయమైంది. వెంటనే కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. నిందితుడిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.